# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 303 మంగళవారం | 18 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## కాకతీయ వారసుడికి సన్మానం

ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని జగదల్ పూర్‌లో 22 వ కాకతీయ వారసుడు బస్తర్ మహారాజు శ్రీ కాకతీయను వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి చెందిన మడిపెల్లి సుశీల్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు.

– వరంగల్ వాయిస్, కాశిబుగ్గ




**బడ్జెట్ మీటింగ్ పై హెచ్చరికలు**

- ప్రజా సమస్యలను పక్కన బెట్టడంపై మండిపాటు
- సమావేశమైన బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు
- చివరి నిమిషంలో హ్యాండిచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు
- అయినా నిరసన చేపడతామంటున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు



వివరాలు 2లో..

# అడ్డుకుంటాం...

## మేయర్ వర్సెస్ కార్పొరేటర్లు

వరంగల్ మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న బడ్జెట్ సమావేశంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. నాలుగు నెలల క్రితం జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలంటూ కోరినప్పటికీ ఎలక్షన్ కోడ్ ఉందంటూ దాటవేసిన మేయర్ స్థానిక సమస్యలను పట్టించుకోకుండా నేరుగా బడ్జెట్ సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు కార్పొరేటర్లు మండిపడుతున్నారు. ఈ మేరకు మంగళవారం బల్దియా కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి మేయర్ కు వ్యతిరేకంగా తమ గళం వినిపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు పాల్గొనాల్సి ఉన్నప్పటికీ చివరి క్షణంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు హ్యాండిచ్చారు. దీంతో బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు పాల్గొని బడ్జెట్ సమావేశం అడ్డుకునేలా కార్యాచరణ రూపొందించారు. ప్రజల సమస్యలను గాలికొదిలిన పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అవసరమైతే అవిశ్వాసానికి కూడా వెనుకాడబోమంటూ హెచ్చరించారు. - వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**



2లో

## విధిగా చెత్త సేకరణ జరగాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**కమిషనర్ అశ్విని తానాజీ వాఖడేతో కలిసి సానిటేషన్‌పై సమీక్షా**



## ఇదేం పని సామీ..?

**డ్యూటీలోనే చిల్ అవుతున్న ప్రభుత్వ ఉద్యోగి**

2లో..

# అడ్డుకుంటాం..

**మేయర్ వర్సెస్ కార్పొరేటర్లు**

**బడ్జెట్ మీటింగ్ పై హెచ్చరికలు**

**ప్రజా సమస్యలను పక్కన బెట్టడంపై మండిపాటు**

**సమావేశమైన బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు**

**చివరి నిమిషంలో హ్యాండిచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు**

**అయినా నిరసన చేపడతామంటున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 20న గ్రేటర్ వరంగల్ బడ్జెట్ సమావేశం నిర్వహించేందుకు మేయర్ తో పాటు అధికారులు సన్నాహాలు చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్పొరేటర్లు మాత్రం అడ్డుకుని తీరుతామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆరు నెలలుగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించక పోవడంతో స్థానికంగా సమస్యలు పేరుకుపోయాయని వాటిని పరిష్కరించకుండా బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం ఏంటని బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. లోక్ సభ ఎన్నికలకు ముందే జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలంటూ మేయర్ ను కోరినప్పటికీ ఎన్నికల కోడ్ ఉందంటూ దాటవేసిన ఆమె ఇప్పుడు నేరుగా బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేయడంపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా తొలుత కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే బడ్జెట్ సమావేశం ఎలా నిర్వహిస్తారో చూస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

## హ్యాండిచ్చిన కాంగ్రెస్..

ప్రజా సమస్యలను గాలికొదిలి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మేయర్ కు వ్యతిరేకంగా మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్పొరేటర్లంతా సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. డిప్యూటీ మేయర్ చాంబర్ ను ఇందుకు వేదికగా చేసుకున్నారు. అయితే ఈ సమావేశానికి బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు, వారి భర్తలు మాత్రమే హాజరయ్యారు. సమవేశం ప్రారంభమయ్యే సమయం వరకు వస్తున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు చివని నిమిషంలో హ్యాండిచ్చారు. అయితే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మేయర్ తోపాటు పార్టీ పెద్దల ఒత్తిడితోనే వారు సమావేశానికి డుమ్మా కొట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## హాజరైన నేతలు..

డిప్యూటీ మేయర్ చాంబర్ లో నిర్వహించిన అత్యవరస సమావేశంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, 39వ డివిజన్ కార్పొరేటర్ సిద్ధం రాజు, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, 59వ డివిజన్ గుజ్జుల వసంత, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ భర్త మసూద్, 16వ డివిజన్ కార్పొరేటర్ భర్త సుంకరి మనిషా శివకుమార్, 25వ డివిజన్ బస్వరాజ్ శిరీష శ్రీమాన్, 37వ డివిజన్ భోగి సువర్ణ సురేశ్ పాల్గొన్నారు.

## అవిశ్వాసానికి వెనుకాడం..

ప్రజల సమస్యలను పక్కనబెట్టి మేయర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అవిశ్వాసానికి కూడా వెనుకాడేది లేదని సమావేశం అనంతరం కార్పొరేటర్ల ప్రకటించారు. బీఆర్ ఎస్ బీజేపీలకు చాలినంత మెజారిటీ లేకపోయినా మేయర్ తీరుపై ఆగ్రహంగా ఉన్న మరి కొందరిని కలుపుకొని అవిశ్వాస తీర్మాణం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వారు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహంచనున్నట్లు ప్రకటించారు. బడ్జెట్ సమావేశంలో వ్యవహరించాల్సిన విధి విధానాలతోపాటు నిరసన కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

# విత్తన దుకాణాల్లో కలెక్టర్ తనిఖీ

**ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ పరిశీలన**

**రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలంటూ ఆదేశం**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలో విత్తనాలు విక్రయించే డీలర్ షాపులను, ఆగ్రో సెంటర్లను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాలతో కలసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, యూరియా స్టాక్ రిజిస్టర్లను వారు పరిశీలించారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎవరు నకిలీ విత్తనాలు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత షాప్ ను సీజ్ చేస్తామంటూ హెచ్చరించారు. ఈ సందర్భంగా విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పేరులేని విత్తనాలు కొనుగోలు చేయకూడదని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ మార్కెట్ సందర్శన..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో నిర్వహిస్తున్న పత్తి క్రయ, విక్రయాలను జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి మంగళవారం పరిశీలించారు. అనంతరం మార్కెట్ రికార్డులను తనిఖీ చేశారు. పత్తి ధర, మార్కెట్ లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద రావు, మార్కెట్ సెక్రెటరీ జి.రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విధిగా చెత్త సేకరణ జరగాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడేతో కలిసి సానిటేషన్ పై సమీక్షా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియా పరిధిలో ప్రతి ఇంటి నుంచి విధిగా చెత్తను సేకరించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సానిటరీ ఇన్ స్పెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి పాల్గొన్న మేయర్ చెత్త సేకరణ సమర్ధవంతంగా నిర్వహించేందుకు తగు సూచనలు చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ఇట్టి ప్రక్రియలో సిబ్బందితో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యం అయినపుడే సానిటేషన్ ప్రక్రియ ఆశాజనకంగా కొనసాగుతుందన్నారు. అంతర్గత డ్రైన్ లు శుభ్రంగా లేవని ఫిర్యాదులు వస్తున్నాయని శానిటేషన్ సంబంధ అంశాలపై ఎస్ ఐ లు దృష్టి సారించాలని, ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఇందుకోసం ప్రత్యేక ప్లాస్టిక్ ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలను రంగంలోకి దింపాలన్నారు. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే సానిటేషన్ ఆశాజనకంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణా రెడ్డి, రవీందర్, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్ కుమార్, సానిటరీ సూపర్వైజర్లు సాంబయ్య, పసునూరి భాస్కర్, నరేందర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ ఆఫీసర్స్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో మంగళవారం నూతనంగా భాధ్యతలు స్వీకరించిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులందరూ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫణి కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, సంజీవరెడ్డి, కోల రాజేష్ కుమార్ గౌడ్, నాగ నారాయణ, సుమలత, రవి, ఆంజనేయులు, రమేష్ కుమార్ రెడ్డి, సుధీర్ కుమార్, సాయి రాజ్ లు పాల్గొన్నారు.

# ఇదేం పని సామీ..?

**డ్యూటీలోనే చిల్ అవుతున్న ప్రభుత్వ ఉద్యోగి**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఒకవైపు ఎండలు మండుతున్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎండనుంచి రక్షణ పొందేందుకు బీర్ తాగుతూ చిల్ అవుతున్నారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఇటీవలి కాలంలో ఏసీబీ దాడులు..సోదాలతో అవినీతి అధికారులకు కంటిమీద కునుకు లేకుండా హడలెత్తించిన సంఘటన మరువక ముందే, పని వేళల్లోనే బీర్ సేవిస్తూ విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బాగోతం వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ కార్యాలయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సురేష్ విధులు నిర్వహిస్తున్న సమయంలోనే మద్యం బాటిల్ ముందు పెట్టుకొని సేవించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ చిత్రం చూసిన జనం ఇదేం పని సామీ అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. దీనికి కారణం ఉన్నతాధికారుల పట్టింపులేని తనమా లేక ఉద్యోగుల బరితెగింపా అంటూ స్కోల్ చేస్తున్నారు.

## ఒగ్గు కథతో బడిబాట ప్రచారం



**వరంగల్ వాయిస్, నడికూడ :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు అర్థమయ్యే రీతిలో నడికూడ మండల పరిధిలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ ఒగ్గు కథ ద్వారా ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని తెలియజేస్తూ, ఒగ్గు కథ చెప్పించారు. ఇప్పుడు ఆ కథ ఉపాధ్యాయ గ్రూపులలో వైరల్ అవుతూ, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, రెండు జతల యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజనం, వారానికి మూడుసార్లు గుడ్లు, వారానికి ఒకసారి వెజ్ బిర్యానీ, అహ్లాదకరమైన తరగతి గదులు, విశాలమైన ఆట స్థలం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులచే విద్యాబోధన ఆంగ్ల మాధ్యమంలో జరుగుతుందని వారి పాట రూపంలో సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా కథ చెప్పడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ తెలిపారు. ఒగ్గు కథ బడిబాట ప్రచారాన్ని, వినూత్న రీతిలో వివిధ పద్ధతుల్లో ప్రచారం చేస్తున్న బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులు నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టిన అచ్చ సుదర్శన్ ను పీఆర్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి, వరంగల్ జిల్లా పీఆర్ టీయూ అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గఫార్, పరకాల మండల శాఖ అధ్యక్షుడు మోడెం రాజేందర్ బాబు, ప్రధాన కార్యదర్శి గొల్ల రాజకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరూ అచ్చ సుదర్శన్ ను అభినందించారు

## డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మానుకోట మునిసిపాలిటీ పరిధిలోని 23వ వార్డు పరిధిలోని డ్రైనేజీ కాలువలో గత కొన్ని రోజులుగా చెత్తను శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీ కాలువలలో చెత్త పేరుకుపోయిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో అపరిశుభ్ర వాతావరణ నెలకొంది. ఇండ్ల మధ్యలో ఉన్న డ్రైనేజీ కాలువలలో చెత్తను తొలగించకపోవడంతో దోమలు ఈగలు చేరి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా మునిసిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన చెత్తను శుభ్రం చేయటం లేదని, ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో ఉన్న చెత్తను శుభ్రం చేయాలని వేడుకుంటున్నారు.

## నీట్ పరీక్ష అవకతవలకపై దర్యాప్తు చేయించాలి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** దేశ వ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్షలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ లో పీడీఎస్ యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్ యూఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మధు మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని, తక్షణమే నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలని లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ రాస్తారోకోలో పలువురు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**37 ఏళ్ల తర్వాత కలుసుకున్న సందర్భం**
**ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ లో వేడుకలు**
**1984-87 బ్యాచ్ డిగ్రీ విద్యార్థుల సందడి**

**వరంగల్ వాయిస్, ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో గల ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1984 -87 బ్యాచ్ కు సంబంధించిన బీఎస్సీ (బీజెడ్సీ) తెలుగు మీడియం విద్యార్థులు 37 సుదీర్ఘకాల సంవత్సరాల తర్వాత ఖమ్మంలోని ఒక ప్రైవేటు వేడుకల మందిరంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. ఖమ్మంలో గల మమత వైద్య కళాశాలలకు చెందిన ఈ బ్యాచ్ లో సభ్యులైన సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మొదటగా వారంతా వేడుకల మందిరంలోకి చేరుకొని అదే బ్యాచ్ కు చెందిన కేదాసు వాసుదేవయ్య, సైదులు అనే ఇద్దరి పుట్టినరోజు సందర్భంగా వారికి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తాము చదువుకున్న కళాశాలకు బ్యానర్ తో సహా వెళ్లి కళాశాల మొత్తం కలియతిరిగి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పుడు చదువుకున్న వారిలో ప్రస్తుత పరిస్థితులలో ఉద్యోగరీత్యా, ఆర్థిక రీత్యా, పిల్లలు సెటిల్ అయిన సందర్భాలను చర్చించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకొని ఉద్యోగ విషయాలు, కుటుంబ యోగక్షేమాలు, తమ పిల్లల సెటిల్ మెంట్ విషయాలు తెలుసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం తమకు విద్య బోధన చేసిన పలువురు లెక్చరర్లను గుర్తుచేసుకొని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమలో ఉన్న కళాత్మక సృజనను వెలికి తీసి కొందరు పాటలు పాడగా.. మరికొందరు నృత్యాలు చేసి ఆనందంగా సాయంత్రం వరకు గడిపారు. బ్యాచ్ లో ఎక్కువగా ఉపాధ్యాయ వృత్తికి చెందినవారు ఉండగా మిగతావారు తహసీల్దార్, జర్నలిస్టులు, సామాజిక సేవ, రాజకీయ నేపథ్యం కలిగిన వారు, లాయర్లు, సైకాలజిస్టులు, తదితర వృత్తిలో స్థిరపడినవారు ఉన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో బండి గణేష్, రిటైర్డ్ ఎంపీడీవో కర్ణాకర్ రెడ్డి, కృష్ణారావు, వెంకటేష్, నిమ్మల శ్రీనివాస్, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, గంగాధర్, రామానుజం, రంగారావు, భాగ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ రాహుల్ శర్మను కలిసిన టీఎన్జీఓఎస్ నాయకులు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ శర్మను మంగళవారం జిల్లా టీఎన్జీఓఎస్ అధ్యక్షుడు బురుగు రవి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. ఈ క్రమంలో నూతనంగా టీఎన్జీఓఎస్ కేంద్ర సంఘంలో రాష్ట్ర సెక్రటరిగా నియామకమైన షఫీ అహ్మద్ ను జిల్లా కలెక్టర్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి గౌడ్ జిల్లా కలెక్టర్ దృష్టికి ఉద్యోగులు సమస్యలు తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరి షఫీ అహ్మద్, జిల్లా కార్యదర్శి దశరథరామారావు, అసోసియేట్అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, వైస్ ప్రసిడెంట్ వంశీకృష్ణ, వేణు, గౌస్, సాగర్, జాయింట్ సెక్రటరీ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు..

## ఉచిత యోగా శిక్షణ తరగతులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో పతంజలి జిల్లా ట్రస్ట్ అధ్యక్షుడు జితేందర్ జి, కొలుగూరి రాజేశ్వర్ రావులు పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హాజరై శిక్షకులకు మెలకువలు నేర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయని తెలిపారు. యోగాతో మానసిక ఒత్తిడి తగ్గి, మనసు ప్రశాంతత లభిస్తుందన్నారు. మనసుకు శరీర వ్యాయామాలు ఒత్తిడి తగ్గించి, బీపీ షుగర్లు దరిచేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునే విధానం మన చేతుల్లోనే ఉందని సూచించారు. ప్రతిరోజు యోగాను మన దినచర్యలో భాగంగా పాటించాలన్నారు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఎంతో ఒత్తిడికి లోనై తీసుకునే ఆహారపు అలవాట్లతో రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. నేడు సామాన్య మానవుడు సంపాదించే సంపాదన ఆసుపత్రి ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి, ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి తగ్గి ఆనందమైన జీవితం వస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకొని ప్రతిరోజు ఉదయం యోగా శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు.

# మాట్ల చేరాలుకు దళిత, ప్రజా సంఘాల నేతల పరామర్శ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** గత నాలుగైదు దశాబ్దాలుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించి చొరవచూపిన మాట్ల చేరాలు సేవలు మరువలేనివని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ (డిబీఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. సోమవారం కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు, పెద్దమనిషి మాట్ల చేరాలు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హనుమకొండ కాకాజీ కాలనీలోని అభయ హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా ఆయనను సామాజిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వారు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా కమలాపూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలోని ప్రజా సమస్యలపై మాట్ల చేరాలు పోరాడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. మొదట కొద్ది రోజులు కాంగ్రెస్ పార్టీలో పనిచేసి అప్పటి హుజురాబాద్ ఎమ్మెల్యే స్వర్గీయ కేతిరి సాయిరెడ్డి ముఖ్య అనుచరుడిగా, తర్వాత తెలుగుదేశం పార్టీలో నాయకుడిగా మాజీ మంత్రి స్వర్గీయ ముద్దసాని దామోదార్ రెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొంది తెలుగుదేశం పార్టీలో క్రియాశీలాక నాయకుడిగా వ్యవహరించి అనంతరం మాజీ మంత్రి అప్పటి టీఆర్ఎస్ నాయకుడు ఈటల రాజేందర్ నాయకత్వంలో మండల స్థాయి నాయకుడిగా పనిచేసి అనేక ప్రజా సమస్యలపై పోరాడుతూ ఒక ప్రజా నాయకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి వచ్చి మరింత ప్రజాసేవలో ముందుకు పోవాలని వారిరువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, నాయకులు చుంచు నరేష్, పోలేపాక మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో జిల్లా కేంద్రంలో మోడల్ బస్టాండ్ నిర్మిస్తాం

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో మంగళవారం మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామానికి వెళ్లే బస్ కి మంత్రి సీతక్క పూజ చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి సీతక్క బస్ లో ప్రయాణించి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో పాటు ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏటూరు నాగారం మండల కేంద్రంలో బస్ డిపో ఏర్పాటుతో పాటు ములుగు జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండ్ ను మోడల్ బస్టాండ్ గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ తో పాటు ఆర్టీసీ అధికారులకు పాల్గొన్నారు.






### అంగన్వాడీ టీచర్ సుజాత కుటుంబానికి పరామర్శ..

ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ ఇటీవలే హత్యకు గురైంది. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క మంగళవారం చిన్నబోయినపల్లికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కాగా, బాధిత కుటుంబానికి రూ.50 వేల చెక్కును సైతం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అందించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకరన్ టీఎస్ తో పాటు అడిషనల్ కలెక్టర్, ఐసీడీఎస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# గాయపడిన గీత కార్మికుడికి పరామర్శ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని జల్లి గ్రామానికి చెందిన మేరుగు సంపత్ గౌడ్ అనే గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం తెలిసిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, రాజు గౌడ్ ను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ సంపత్ గౌడ్ కు ఎక్సైజ్ శాఖ , బీసీ కార్పొరేషన్ నుంచి ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చుల కోసం దరఖాస్తు చేయడం జరుగుతుందన్నారు. గత ఆరు నెలలుగా గాయపడిన, చనిపోయిన గీత కార్మికులకు పెండింగ్ ఎక్స్ గ్రేషియా, హాస్పిటల్ ఖర్చులు చెల్లించడం లేదన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్పొరేషన్ కు చైర్మన్ ను నియమించాలని, కార్పొరేషన్ కు రూ.500 కోట్లు నిధులు కేటాయించాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. రాజు గౌడ్ ను పరామర్శించిన వారిలో మదూరి సోమన్న గౌడ్, జక్కుల మధు గౌడ్, మేరుగు నవీన్ గౌడ్, చలమల్ల సత్యం గౌడ్, మల్లయ్య గౌడ్ ఉన్నారు.

# పోగొట్టుకున్న పింఛన్ డబ్బులు అందజేత



**వరంగల్ వాయిస్, రేగొండ :** ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ తోనే ఇల్లు గడుపుకుంటున్న ఈ రోజుల్లో నిరుపేద కుటుంబ వ్యక్తి పింఛన్ పోగొట్టుకొని ఇంటికి తిరిగి వచ్చిన కొలెపాక ఆదాం అను వ్యక్తికి పెన్షన్ డబ్బులను తిరిగి అప్పగించి తన మంచితనాన్ని చాటుకున్న రేగొండ మండల కేంద్రంలోని సీనియర్ రిపోర్టర్ రమేష్ మంగళవారం అప్పగించారు. సీనియర్ రిపోర్టర్ నామాల రమేష్ కథనం ప్రకారం తన పార్ట్ టైం ఎల్ఐసీలో భాగంగా తన ఇంటి నుంచి గ్రామపంచాయతీ వైపు వెళుతుండగా పింఛన్ కలిగి ఉన్న బుక్కు ఉండడంతో ఆగి పరిశీలించారు. బుక్కులో ఆసరా పింఛన్ దారుడు స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన పేరు ఆధారంగా గుర్తించి, డబ్బులను డ్రా చేసుకొని రూ.2016లు బుక్కులో పెట్టుకొని వెళుతుండగా బుక్కు గ్రామపంచాయతీ రోడ్డుపై పడి ఉండడంతో ఆ బుక్ ని డబ్బులను గమనించి వెంటనే వారి ఇంటికి తీసుకెళ్లి అప్పగించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎంతోమంది వ్యక్తులు వారి విలువైన వస్తువులను పోగొట్టుకుంటే తిరిగి వారికి అప్పగించడం సమాజంలో ప్రతి ఒక్కరికి శ్రేష్టంగా ఉంటుందన్నారు. పింఛన్ దారుడు ఆదాం పోగొట్టుకున్న డబ్బులు తిరిగి అందజేసి తన మంచితనాన్ని, మానవత్వాన్ని సమాజ హితాన్ని కోరే వ్యక్తిగా రిపోర్టర్ రమేష్ ను వారి కుటుంబ సభ్యులు అభినందించగా, తోటి స్నేహితులు మిత్రులు కలిసి అభినందించారు..

# మధుపాక ఎల్లయ్యకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ సోషియాలజీ విభాగ పరిశోధకుడు మధుపాక ఎల్లయ్యకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. నరసింహ చారి డాక్టరేట్ ప్రకటించారు డాక్టర్ మధుపాక ఎల్లయ్య "గౌతమ బుద్ధాస్ టీచింగ్స్ అండ్ ఇట్స్ రెలెవెన్స్ టూ ది కాంటెంపరరీ ఇండియన్ సొసైటీ (గౌతమ బుద్ధ 'స్ టీచింగ్స్ అండ్ ఇట్ 'స్ రిలేవాన్స్ టూ ది కాంటెంపోరారీ ఇండియన్ సొసైటీ )" అనే అంశంపై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే.రామానుజ రావు పర్యవేక్షణలో పూర్తి చేశారు. తిమ్మాపురం గ్రామం, ఖిల్లా వరంగల్ మండలం, వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ మధుపాక ఎల్లయ్య ప్రస్తుతం బలపాల గ్రామం, కురవి మండలం, మహబూబాబాద్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ మధుపాక ఎల్లయ్యను అభినందించారు.

# సమస్యలు మిన్న.. స్పందన సున్నా

## పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

## రైతుల సొంత డబ్బులతో, రోడ్ల మరమ్మతు



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలోని శ్రీరామగిరి గ్రామం నుంచి లక్ష్మీపురం ఎక్స్ రోడ్డు వెళ్లే ఆలేరు డోనక రోడ్డు రైతులకు రాకపోకలు శాపంగా మారాయి. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పిన ప్రయోజనం లేకపోవడంతో రైతులే సమిష్టిగా కొంత సొంతడబ్బులు కూడబెట్టుకొని 60 ట్రాక్టర్ ట్రిప్పుల మోరాన్ని జేసీబీ, ట్రాక్టర్లతో డోజర్, యంత్రాలతో రోడ్డు మరమ్మత్తులను చేయించారు. దాదాపుగా 200 మంది రైతులు వారికి నిత్యం వ్యవసాయ పనులకు ఈ రోడ్డు పై నుంచే రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు బురదతో గుంతలమయమై ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. గతంలో కూడా రోడ్డుకు మరమ్మత్తులు నిర్వహించాలని అనేకమార్లు విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుకు మరమ్మత్తులు నిర్వహించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# విద్యార్థులు కళలపై ఆసక్తి కల్గి ఉండాలి

## జాతీయ మెజీషియన్ కళ్యాణ్ పిలుపు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** విద్యార్థులు చదువులతో పాటు కళలు, సంగీతంలో కూడా ఆసక్తి కనబర్చాలని నగరానికి చెందిన జాతీయ మెజీషియన్ మాయలోడు ఫేం శ్రీరాం కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ లోని ప్రభుత్వ సహాయక ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తన మ్యాజిక్ తో విద్యార్థులను ఆనంద పారవశ్యంలో ముంచెత్తారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, లయన్ డా.గుజ్జారి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. తరగతుల వారీగా మెరిట్ విద్యార్థులకు,100 శాతం అటెండెన్స్ లో రూ.పది వేల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ వి.రవి, ఉపాధ్యాయులు టి.నరేందర్, డి.శ్యాం, బి.పూర్ణ చందర్, పి.మనోజ్, ఉపాధ్యాయినిలు ఉషారాణి, సునీత, సుజాత, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# 'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు అనూహ్య స్పందన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని అమలు చేస్తూ ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఒక వేదికను ఏర్పాటుచేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని టీపీసీసీ గీతా సెల్ సెక్రెటరీ రావుల వెంకట రమేష్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కొనియాడారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు, చెరువు కట్టల పూర్తి మరమత్తులు, లైబ్రరీ, గ్రామాలలో గుడుంబా అమ్మకాల నిషేధం, గంజాయి సేవించడం/ విక్రయించడం రైతులకు సంబంధించిన నకిలీ విత్తనాలను అరికట్టడం గురించి 'డయల్ యువర్ ఎమ్మెల్యే' ద్వారా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు దృష్టికి తీసుకు వస్తే సానుకూలంగా స్పందించి 24 గంటల లోపు ఈ సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలు చూపిస్తున్నారు. ప్రజలకు రిటర్న్ కాల్ చేసి మరీ చెప్పడం జరుగుతుంది. మీ మీ గ్రామాల్లో, వార్డులో, ఊర్లో ఎటువంటి సమస్యలు ఉన్నా, ఏమైనా అభివృద్ధికి సంబంధించి కావాల్సిన పనులు ఉన్నా 8096107107 నంబర్ కు కాల్ చేసి ఆ సమస్యను తెలపాలని వెంకట రమేష్ గౌడ్ కోరారు.

# ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్టుకు దరఖాస్తు చేసుకోండి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్ లైన్ గ్రాండ్ టెస్టులను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా ఎంపీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్ లో జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి 12-30 వరకు అలాగే, మధ్యాహ్నం 1-30 నుంచి సాయంత్రం 4-00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.టెస్టులకు హాజరయ్యే ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 040-24071178 ద్వారా సంప్రదించాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. ఎంపీవీ ప్రసాద్ కోరారు.

# నాకు న్యాయం చేయండి

## బాధితురాలు బొలుగొడ్డు స్వరూప



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలం ఏనుగల్ గ్రామానికి చెందిన బొలుగొడ్డు స్వరూప తన వ్యవసాయ భూమిలో తాను లేని సమయంలో సోమవారం నాడు ఎస్సై వచ్చి భూమిని దున్నించారని మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు. ఈ నెల 2న స్థానిక మహిళలైన స్వరూపకు చెందిన వ్యవసాయ భూమికి వద్దకు పర్వతగిరి పోలీసు స్టేషన్ ఏ ఎస్ఐ వచ్చి ఆమెపై ఫిర్యాదు వచ్చిందని, తనకు సంబంధించిన పత్రాలు తీసుకొని రమ్మన్నారని తెలియడంతో ఆమె వెళ్లగా ఏఎస్ఐ పక్కనే ఉండి తన భూమిని మరికొకరితో దున్నించారని ఆమె తెలిపారు. నా పత్రాలు చూడకుండా ఎలా దున్నిస్తారని ఏఎస్ఐని ప్రశ్నించగా దున్నడం ఆపించి ఎస్ఐని కలవమని చెప్పారు. అదే రోజు ఎస్ఐను స్వరూప కలిసి తన డాక్యుమెంట్లను పూర్తిగా చూపించగా ఇవి చెల్లవని నీ మీద ఫిర్యాదు చేసిన వద్దే రాణి, నల్లపు ఉష వారి పత్రాలు చెల్లుతాయని అన్నారని ఆమె గోడు వెళ్లబోసుకున్నారు. ఆదివారం రాత్రి స్టేషన్ రైటర్ రమణ స్వరూపకు ఫోన్ చేసి రేపు ఫీల్డ్ ఎంక్వయిరీకి ఎస్ఐ వస్తున్నారని చెప్పగా తను ఉండటం లేదని తెలిపినప్పటికీ తను లేని సమయంలో ప్రత్యర్థులకు అనుకూలంగా ఉండి ఎస్సై తన భూమిని దున్నించారని ఆమె ఆరోపించారు. ఇదీలా ఉండగా స్వరూప 2005 సంవత్సరంలో తన తండ్రి ద్వారా పొందిన వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటుండగా తన చిన్నన్నయ్య నల్లపు సాంబయ్య అడ్డుపడగా కోర్టులో కేసు వేసి గెలిచానని తెలిపారు. ఆ తర్వాత జిల్లా కోర్టు వారు ల్యాండ్ సర్వే శాఖ వారితో భూమిని కొలిపించి హద్దురాళ్లు ఏర్పాటు చేయించి తనకు కబ్జా ఇప్పించిందని, అప్పటి నుంచి నేనే దున్నుకుంటున్నానని ఆమె అన్నారు. 2014 సంవత్సరంలో స్వరూపకు చెందిన భూమి ఆక్రమించుకొనుటకు నల్లపు సౌందర్య, వద్దే రాణి, నల్లపు ఉష తదితరులు ప్రయత్నించగా తన భూమిలోకి రాకుండా కోర్టు ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ పొందానని ఆమె తెలిపారు. ఓఎస్ నెంబర్ 261/2014.(న్యూ 2192/2022). వద్దే రాణి, నల్లపు ఉషలు దొంగ పాస్ బుక్కులు చేయించుకున్నందున వీరిపై కోర్టులో కేసు వేయగా కేసులో తీర్పు వచ్చేంత వరకు ఇతరులకు బదిలీ చేయకూడదని కోర్టు వారు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చారు. అయినప్పటికీ కోర్టును మోసం చేసి వారి భర్తల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి ఇంజక్షన్ ఆర్డర్ పొందారని, దీనిపై జిల్లా కోర్టులో కేసు వేశామని ఆమె తెలిపారు. ఓ ఎస్ నెంబర్ 461/14.(న్యూ1076/22), అలాగే 2014 సంవత్సరంలో స్వరూపపై నల్లపు సౌందర్య, వద్దే రాణి తదితరులు దాడి చేయగా వారిపై రెండు క్రిమినల్ కేసులు సెక్షన్ 290, సెక్షన్ 447, 427, 506 ఆర్/డబ్ల్యూ34 (352/14) లు నమోదు అయ్యాయని తెలిపారు. ఇప్పుడు కేసులు ట్రయల్ కు రావడంతో సాక్షులను బెదిరిస్తున్నారని, తనను భూమిని దున్నకుండా ఆపడమే కాక, చంపుతామని బెదిరిస్తున్నారని ఆమె వాపోయారు. తన కౌలు దారు ఇంటికి రాత్రి 10 గంటలకు పోయి భూమిని సాగు చేయవద్దని బెదిరించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసులు విచారణ జరుగుతున్న సమయంలో భూమి పై భయానక వాతావరణాన్నిసృష్టిస్తున్నారని, ఎస్సై కూడా వారికి సహకరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని జిల్లా పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆమె తెలిపారు. పైగా తన భూమిపైకి వెళితే కేసులు పెట్టి జైలుకు పంపుతానని ఎస్ఐ అన్నారని ఆమె ఆవేదనను వెలిబుచ్చారు. ఈ సమయంలో తనపై ఏమి జరిగినా ఎస్సైదే బాధ్యత అని ఆమె విలేకరులకు తెలిపారు. తనకు న్యాయం చేయాలని జిల్లా పోలీసు అధికారులను కోరారు.

## కలెక్టర్ సత్య శారదా దేవిని కలిసిన టీఎన్జీవోస్ నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్, ప్రధాన కార్యదర్శి గాదే వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తూ జిల్లాను ముందుకు తీసుకెళ్లాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే కార్యక్రమాలను ప్రజలకు అందించేందుకు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గజ్జల రామ్ కిషన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, సహ అధ్యక్షుడు హేమానాయక్, ఉపాధ్యక్షులు గద్దల రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, సహాయ కార్యదర్శి లు, రమాదేవి, రామకృష్ణ, వంశీ, ప్రచార కార్యదర్శి శంకేసి రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జి.సత్యనారాయణ, మహమ్మద్ యూసుఫ్, సునీత, జి.నాయర్, సిటీ కార్యదర్శి మధుచంద్ర, సంగెం యూనిట్ అధ్యక్షులు కిరణ్ కుమార్, కార్యదర్శి సతీష్, వర్ధన్నపేట అధ్యక్షులు దేవేందర్ , నెక్కొండ యూనిట్ కార్యదర్శి కృష్ణ, ఎంజీఎం హాస్పిటల్ యూనిట్ కోశాధికారి నాగేశ్వరరావు, సిటీ కోశాధికారి శ్రీనివాస్, మెడికల్ ఫోరం అధ్యక్షులు మాడిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి రజనీకాంత్, వెటర్నరీ ఫోరం అధ్యక్షులు సత్యనారాయణ ఎడ్యుకేషన్ ఫోరంప్రశాంత్, నిరంజన్, చందు, మానస, ఐసీడీఎస్ ఫోరం నాయకులు కుమారస్వామి, ప్రవీణ్ మార్కెట్ ఫోరం నాయకులు శివకుమార్, మురళి యాదవ్, వెంకన్న గంగాధర్, వివేక్, ఈఎస్ఐ హాస్పిటల్ ఫోరం ఆనందరావు ,ఆనందం, జిల్లా నాయకులు ,రమేష్, నూతన్ ప్రసాద్, భరత్, శ్వేత, శుక్రుమియా, సందీప్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి భానుప్రసాద్, మనీలా, తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలి

## ఈనెల 25లోపు రాష్ట్ర కమిటీ ఎన్నికలు



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలి చేనేత కార్మికులు సమస్యల సాధన కోసం సమిష్టిగా ఉద్యమించాలని, రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ అవకాశం ఉన్నచోట పోటీ చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాజీ ఎంపీపీ వేముల బాలరాజు నేత, సీనియర్ జర్నలిస్టు జనగామ జిల్లా కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత కోరారు. మంగళవారం స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం చిల్పూరు మండలం చిన్నపెండ్యాల గ్రామంలో నియోజకవర్గ స్టేషన్ ఇంచార్జి గజ్జల దామోదర్ నేత ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తు మనదేనని, రాజకీయాల కోసం కచ్చితంగా పోరాటం చేద్దామని, హక్కులు సాధించుకుందామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వారు వివరించారు. ఈ నెల 25 లోపు రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఆకలి, అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐదు లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి ఎన్నికల హామీ మేరకు ఇప్పటికైనా ఇచ్చిన మాటకు కట్టుబడి నేతన్నలకు అండగా నిలవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బలమైన శక్తిగా పద్మశాలీలు ఉన్నారని, రాజకీయ శక్తి ఎదగాలని వారు అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాల కమిటీ ఏర్పాటు చేసేందుకు కృషి చేశామని, అలాగే జనగామ జిల్లాలో నూతన కమిటీని ఏర్పాటుకు చేసామని వారు తెలిపారు. పద్మశాలి సమాజం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ నియోజకవర్గ పద్మశాలి సంఘం ఇంచార్జి గజ్జల దామోదర్ నేత, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ చేనేత ఇంచార్జి శ్యామల పరమేశ్వర్ నేత, చింతకింది భిక్షపతి నేత, పేరాల నాగభూషణ్ నేత, జిల్లా రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



## 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చిరునవ్వులు, ఆత్మీయ పలకరింపులు.. గురువుల సన్మానాలకు హనుమకొండలోని ఎస్ వీ ఫంక్షన్ హాల్ వేదికైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని విజ్ఞానజ్యోతి విద్యాలయంలో 1998,1999 సంవత్సరాల్లో పదోతరగతి కలిసి చదువుకున్న రెండు బ్యాచ్ ల విద్యార్థుల సమ్మేళనం శనివారం ఎంతో ఆత్మీయంగా జరిగింది. 25 ఏళ్ల తర్వాత కలవడంతో ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కొందరు అమెరికాలో సెటిల్ అయ్యామని, మరికొందరు తమ పిల్లలను బాగా చదివిస్తున్నామని, పలువురు సొంత వ్యాపారాలు చేస్తున్నామంటూ వారి విషయాలను పంచుకున్నారు. నాటి గురువులు నర్సింగరావు, దేవేందర్ రావు, మల్లయ్య, బొజ్జ సురేందర్, సురేందర్, చక్రధర్, సుధాకర్, సూర్యనారాయణ, లక్ష్మారెడ్డి, యాదగిరి (గణపురం మండల కేంద్రంలో ప్రొబెల్ పాఠశాల కరస్పాండెంట్)లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేశారు. గురువులు విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

## దేశిని లక్ష్మీ నారాయణ గౌడ్‌కు అవార్డు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీత దేశిని లక్ష్మీనారాయణ గౌడ్ ను సీఆర్పీఎఫ్ ఘనంగా సన్మానించారు. మండలంలోని రంగయ్యపల్లికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి, వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్, రాష్ట్ర గవర్నర్ అవార్డు గ్రహీత లక్ష్మీనారాయణ గౌడ్ కు హనుమకొండలోని సీఆర్పీఎఫ్ 54వ బెటాలియన్ లో మంగళవారం కమాండెంట్ మెహన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. అవార్డు గ్రహీత లక్ష్మీనారాయణ తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహించి రెడ్ క్రాస్ కు రక్తాన్ని అందించినందుకు గాను, రాష్ట్ర గవర్నర్ సీవీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ప్రజా చైతన్య సేవా అవార్డును అందించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మోహన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం తన వంతుగా బహువిధ సేవలు అందిస్తూ లక్ష్మీనారాయణ స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్లు కె.సుమ, తులసి, దుర్గామాత దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు లలిత్ అగర్వాల్, హిమ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ ఉపాధ్యాయులు, లక్ష్మీనారాయణ గౌడ్ అనేక ప్రజాసేవ, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని అవార్డు అందుకున్న నేపథ్యంలో రంగయ్యపల్లి గ్రామానికి చెందిన యువకులతో పాటు మండలంలోని పలు గ్రామాల స్నేహితులు, ఉపాధ్యాయ బృందాలు అభినందనలు తెలిపారు.

## కాజీపేటలో గంజాయి పట్టివేత



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ వద్ద అనుమానస్పదంగా ఒక వ్యక్తి కనిపించడంతో కాజీపేట ఎస్సై శివకృష్ణ అతడిని అదుపులోకి తీసుకొని అతడిని పరిశీలించగా రూ.5,50,000 లక్షల గంజాయి పట్టుబడింది. గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అఖిల నాయక్ బిపిన్ కుమార్ గా గుర్తించారు. పోలీసులు ఆ వ్యక్తిని విచారించగా చాలా రోజుల నుంచి ముంబైలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి పూణేలో అమ్మేవాడినని, ఇలా చేస్తున్న క్రమంలో 2018లో పూణే పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి జైలుకు పంపించినట్లు తెలిపాడు. మళ్లీ జైలు నుంచి తిరిగి బయటకు వచ్చిన తర్వాత పూణేలో అమ్మితే పోలీసులకు దొరుకుతానని భావించి గంజాయిని వివిధ రైల్వే స్టేషన్లలో అమ్మేందుకు ప్లాన్ వేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 16న ముంబైలో గంజాయిని కొనుగోలు చేసి, దానిని మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్ లో విక్రయించేందుకు దిగడంతో పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించాడు. అతడి వద్ద నుంచి రూ.5,50,000 లక్షల విలువ చేసే గంజాయి ప్యాకెట్లు, సెల్ ఫోన్, డెబిట్ కార్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో దొరికిన వ్యక్తిపై కాజీపేట ఇన్ స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ప్రజల క్షేమమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, గోవిందరావుపేట :** ప్రజల క్షేమమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ గోవిందరావుపేట మండలంలోని ప్రాజెక్ట్ నగర్ వరద ముంపు గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగు వరద ప్రవాహ ఉధృతి పెరిగే సమయంలో గృహాలను విడిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని తెలిపారు. జంపన్న వాగు పరివాహక ప్రాంతంలో ఉండే గ్రామాలు జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికారులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నగర్ గ్రామంలో గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు వరదల కారణంగా జరిగిన ప్రమాదాన్ని వరద ఉధృతి తీరును స్థానిక గ్రామస్తులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముంపుకు గురైన గ్రామస్తులు తమకు నూతన గృహాలను నిర్మించాలని కలెక్టర్ ను కోరగా వాటిపై అన్ని విధాలుగా అధికారులతో కూలంకషంగా చర్చించి నివేదిక ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటి సారిగా కలెక్టర్ తమ గ్రామానికి రావడంతో ప్రాజెక్ట్ నగర్ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట తహసీల్దార్



సుజన్ కుమార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రజల నుంచి నేరుగా దరఖాస్తు స్వీకరణ..

**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్ మంగళవారం ఏటూరునాగారం మండలం దొడ్ల కొత్తూరు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా అయన గ్రామస్తుల నుంచి నేరుగా దరఖాస్తును స్వీకరించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ భూమి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు. వ్యవసాయానికి సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలు వెంటనే సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** నీట్ ప్రవేశ పరీక్షలను తక్షణమే రద్దుచేసి 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో తొర్రూరు పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బందు మహేందర్, సీవైఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సురేష్ బాబు, ఏఐఎఫ్డీఎస్ నియోజకవర్గ నాయకులు అరుణ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎండి నజీర్ లు మాట్లాడుతూ ఎన్ టీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్ తీరుతో కేంద్ర ప్రభుత్వం 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడేశారని అన్నారు. ఓవైపు మార్కుల గందరగోళం, మరోవైపు పేపర్ లీకేజీలు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పేపర్ లీకేజీలు చేస్తున్న వారిపై విచారణ చేపట్టి దోషులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరంగా ఉందన్నారు.వెంటనే దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఈ ఘటనకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# స్కూల్ బస్సులకు ఫిట్ నెస్ లేకుంటే సీజ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు మోటార్ వాహనాల చట్ట నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి గౌస్ పాషా కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల బస్సులను ఆయన పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులన్నింటికి ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఫిట్నెస్ కోసం కార్యాలయానికి తీసుకువచ్చిన బస్సులను స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు 116 బస్సులు ఉన్నాయని, ఇప్పటి వరకు 70 బస్సులను ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహించామని, కండిషన్ లేని బస్సులను తిప్పి పంపించామన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రశీదు, పొల్యూషన్ అండ్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. బస్సులలో పరిమితికి మించి విద్యార్థులతో ప్రయాణం చేస్తే ఆ బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# ఓరుగల్లు విద్యా కుసుమం మడుపోజు భువన కృతి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ జాతి విద్యా కుసుమం మడుపోజు భువన కృతి అని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ చొల్లేటి కృష్ణమాచార్యులు అన్నారు. హనుమకొండ జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం, వరంగల్ ఉమ్మడి జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ల అధ్యక్షుడు బ్రహ్మశ్రీ అలుగోజు కృష్ణమూర్తి అధ్యక్షతన హనుమకొండ టీఎన్జీఓఎస్ భవన్‌లో ఇటీవల పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థిని కుమారి మడుపోజు భువన కృతి అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ రామోజు నాగరాజా రావు మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని తరిగిపోయి, కరిగిపోయేవని కానీ, విద్య మాత్రం కరిగి, తరిగిపోకుండా సమాజంలో మనిషికి గుర్తింపును కల్పిస్తాయన్నారు. ఈ సందర్భంగా భువన కృతిని అభినందిస్తు జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ పక్షాన, రాష్ట్ర, హనుమకొండ జిల్లా విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం పక్షాన రూ.7500.00, నగదు ప్రోత్సాహం అందించి ఘనంగా సత్కరించడం జరిగింది. హనుమకొండ జిల్లా సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ అలుగోజు కృష్ణమూర్తి కుమారి భువన కృతికి ఉన్నత విద్యాభ్యాసం కోసం లాప్ టాప్ అందజేస్తానని సభా వేదికపై ప్రకటించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ అభినందన సభలో జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ కన్వీనర్ గౌరవాధ్యక్షుడు బ్రహ్మశ్రీ వీణవంక సదానందం, హనుమకొండ జిల్లా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ రామోజు నాగ సోమేశ్వరా చారి, కార్పెంటర్ అసోసియేషన్



నాయకులు బ్రహ్మశ్రీ రాళ్లబండి వీరాచారి, బ్రహ్మశ్రీ వేమూనూరి సోమేశ్వర్, బ్రహ్మశ్రీ కత్రోజు లింగాచారి, బ్రహ్మశ్రీ వీణవంక రాజేశ్వర్, బ్రహ్మశ్రీ వెలకంటి బ్రహ్మచారి, బ్రహ్మశ్రీ పబ్బోజు రాజేష్, బ్రహ్మశ్రీ ఉప్పుల సంతోష్, బ్రహ్మశ్రీ మడుపోజు రామకృష్ణ, ఉమ్మడి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ కట్టా ఈశ్వర ప్రసాద్, టీఎన్జీవోస్ నాయకులు బ్రహ్మశ్రీ కలకొండ రాంప్రసాద్, వోపా ఉమ్మడి జిల్లా నాయకులు బ్రహ్మశ్రీ మహేశ్వరం భిక్షపతి, కృష్ణా కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బండ్ల సురేందర్, హనుమకొండ జిల్లా సంఘ నాయకులు బ్రహ్మశ్రీ ఆకోజు నాగాచారి, బ్రహ్మశ్రీ సిరికొండ సాంబయ్య, బ్రహ్మశ్రీ అడ్లూరి మల్లిఖార్జున్, బ్రహ్మశ్రీ పెద్దోజు ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ సంఘ నాయకులు బ్రహ్మశ్రీ మడుపు సత్యనారాయణ, బ్రహ్మశ్రీ మహారాజ భరత్, బ్రహ్మశ్రీ కందుకూరి ముకుందాచారి, కుమారి భువన కృతి తల్లి తండ్రులు, బంధుమిత్రులు, తెలంగాణ రాష్ట్ర బాషోపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ చొల్లేటి లక్ష్మీనారాయణ, మహిళా నాయకురాలు మడుపు మంజుల, శ్రేయోభిలాషులు దాదాపు 150 మంది విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులు పాల్గొని కుమారి భువన కృతిని సత్కరించారు.

# నీట్ పేపర్ లీకేజీపై జ్యుడీషియల్ విచారణ జరపాలి

## నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నీట్ పేపర్ లీకేజీ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. మే 5న దేశవ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షను దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు రాశారని, జూన్ 4న విడుదలైన నీట్ ఫలితాలలో ఎన్నడూ లేని విధంగా 67 మందికి 720/720 మార్కులు వచ్చాయని, టాప్ స్కోర్ వచ్చిన 67 మందిలో 6గురు హర్యానాలోని ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయడంతో పలు అనుమానాలు తలెత్తాయని పేర్కొన్నారు. పరీక్షకు ఒక రోజు ముందే మే 4న పక్కా ప్లాన్ ప్రకారం పేపర్ లీక్ చేయడం, ఇందుకోసం బీహార్ కు చెందిన ముఠా 35 మంది విద్యార్థుల నుంచి రూ.30 లక్షల చొప్పున భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు తేలిందని తెలిపారు. పేపర్ లీకేజీ వ్యవహారం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, విద్యార్థుల జీవితాలతో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెలగాటం ఆడాయని ఆరోపించారు. కేంద్రం అసమర్థత, అధికారుల అలసత్వం కారణంగా లక్షలాది మంది నీట్ పరీక్షను రాసిన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని, దీనిపై ప్రధాన మంత్రి మోడీ నోరు మెదపడం లేదని, ఇప్పటికైనా ఈ లీకేజీ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే, వైద్య విద్య ప్రవేశ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# సివిల్ సర్వీసు-2025 పోటీ పరీక్షకు ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సివిల్ సర్వీసు-2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా ఎంపీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా చేసుకోవాలని కోరారు. డిగ్రీ పాసై, శిక్షణ పొందగోరు అభ్యర్థులు జూలై 3 లోగా తమ పేర్లను https://tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నెం.040-24071178 ద్వారా సంప్రదించాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.ఎంపీవీ ప్రసాద్ కోరారు.

# చిన్నారిని హత్య చేసిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఆరు సంవత్సరాల బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన ఉన్మాద నిందితుడిని వెంటనే ఉరితీయాలని, అలాగే వారి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరేళ్ల బాలికపై అత్యాచారం హత్యపై రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు మాట్లాడుతూ టేకేదారులు, రైస్ మిల్లు, ఇటుక బట్టీల, యజమానులు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ వేతనాలకు తీసుకువచ్చి ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా పనిలో చేర్చుకుంటున్నారని ఇతర రాష్ట్రాలను తీసుకువచ్చిన వారి సంబంధిత వివరాలు పోలీసు సిబ్బంది దగ్గర లేకపోవడం ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. హత్య చేసిన నిందితుడిని ఫోక్సో చట్ట ప్రకారం శిక్షించి వారి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఒక వాహనదారుడికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 1000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 05 మందికి రూ.2900 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. శ్రీధర్ తెలిపారు.

# మిస్టర్ బచ్చన్‌గా అలరించనున్న రవితేజ




'మిస్టర్ బచ్చన్'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు రవితేజ. ఆయన హీరోగా నటిస్తున్న ఈ సినిమాని హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి షో రీల్ పేరుతో ఓ వీడియో గ్లింప్స్ విడుదల చేశారు. దాదాపు నిమిషం నిడివి ఉన్న ఈ ప్రచార చిత్రంలో ఒక్క డైలాగ్ లేకున్నా.. రవితేజ ఆద్యంతం మాస్ యాక్షన్ హంగామాతో అలరించారు. ఆయన ఇందులో నిజాయతీ గల ఆదాయపన్ను అధికారిగా కనిపించనున్నట్లు అర్థమవుతోంది. తను ఓ రాజకీయ నాయకుడి ఇంటికి రైడ్‌కు వెళ్లాక ఏం జరిగిందనే ఆసక్తికర అంశంతో ఈ సినిమా రూపొందించినట్లు తెలుస్తోంది. ఆఖర్లో అమితాబ్ కటౌట్ ముందు ఆయన్ని అనుకరిస్తూ రవితేజ కనిపించిన తీరు ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. త్వరలోనే విడుదల తేదీ ప్రకటించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: మిక్కీ జె.మేయర్, ఛాయాగ్రహణం: అయనంక బోస్.

## తగ్గేదే లేదంటున్న ఫాజిల్

మలయాళం సూపర్ స్టార్ ఫహాద్ ఫాజిల్ 'పుష్ప 2' లో ఒక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకి ముందు 'పుష్ప' లో ఫహాద్ ఫాజిల్ కనిపించారు, ఇప్పుడు ఈ సీక్వెల్ లో అతని పాత్ర నిడివి ఇంకా ఎక్కువ ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఆగస్టు 15 న విడుదల కావాల్సి వుంది, కానీ ఇప్పుడు డిసెంబర్ 6 కి వాయిదా పడింది. అయితే ఇంత దూరం వాయిదా పడటంతో అయితే ఇంత దూరం వాయిదా పడటంతో అల్లు అర్జున్ అభిమానులు కొంచెం అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇక ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ విషయానికి వస్తే అతను మలయాళంలో చేసిన సినిమా 'ఆవేశం' చాలా పెద్ద విజ్జయం సాధించటమే కాకుండా, వంద కోట్ల క్లబ్బులోకి చేరింది కూడా. మలయాళం పరిశ్రమలో ఫహాద్ ఫాజిల్ ఇప్పుడు పెద్ద సూపర్ స్టార్ అయిపోయారు. మరి అటువంటి సూపర్ స్టార్ తెలుగు సినిమా 'పుష్ప 2' కి తీసుకుంటున్న పారితోషికం ఎంతో తెలిస్తే షాకవుతారు. ఫహాద్ ఫాజిల్ ఈ సినిమా కోసం రోజువారీ పారితోషికం తీసుకుంటారని తెలుస్తోంది. అతను రోజుకి రూ.12.50 లక్షలు పారితోషికం తీసుకుంటారని సమాచారం. ఈ షెడ్యూల్ లో సుమారు నెల రోజులపాటు తన తేదీలను ఈ సినిమా కోసం కేటాయించారు ఫహాద్ ఫాజిల్. ఇంతకు ముందు కూడా చాలా రోజులు ఈ సినిమా కోసం కేటాయించారు. గత రెండు సంవత్సరాల నుండి ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది, కానీ ఇంకా పూర్తి కాలేదు. అయితే ఇక్కడే ఇంకొక ట్విస్టు కూడా వుంది. ఫహాద్ ఫాజిల్ ఈ సినిమాకి కేటాయించిన తేదీలలో ఒకవేళ చిత్రీకరణ ఎటువంటి పరిస్థితుల్లో అతనితో చెయ్యకపోయినా, చిత్రీకరణ ఆగిపోయినా ఫహాద్ ఫాజిల్ కి పారితోషికం ముట్ట చెప్పాల్సిందే. అదే తెలుగు క్యారెక్టర్ నటులైతే, ఒకవేళ చిత్రీకరణ కాన్సుల్ అయితే ఆరోజు పారితోషికం ఇవ్వరు, కానీ ఫహాద్ ఫాజిల్ కి అలా కాదు, అతనికి ఇవ్వాల్సిందే. అదీ అతని డిమాండ్.చాలాసార్లు అతను ఇచ్చిన తేదీల్లో చిత్రీకరణ జరగని సంఘటనలు కూడా వున్నాయి, అయినా కూడా అతనికి పారితోషికం చెల్లించారు. తెలుగు ఫిల్మ్ మేకర్స్ కి తెలుగు క్యారెక్టర్ నటులంటే అంత చిన్నచూపు, పరభాషా నటులంటే వారు పెట్టిన షరతులు అన్నిటికీ తలవొగ్గి మరీ తీసుకుంటారు.







## కుటుంబకథా చిత్రాలే ఇష్టం..

కుటుంబంతో కలిసి చూసే సినిమాల్లో నటించడమే నా లక్ష్యం అని అంటోంది బాలీవుడ్ భామ కియారా అడ్వాణీ. 'ఫగ్లీ'తో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన ఈ అందాల తార.. తన నటనతో తెలుగు ప్రేక్షకులనూ మెప్పించింది. త్వరలో 'గేమ్‌ఛేంజర్'తో రావడానికి సిద్ధమవుతున్న కియార.. హిందీ పరిశ్రమలో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తన అనుభవాలను పంచుకుంటూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. 'నటిగా ఎదగాలనే లక్ష్యంతో నాకు 21ఏళ్లు ఉన్నప్పుడు సినీ కెరీర్‌ను ప్రారంభించాను. అప్పుడు నేనేం చేస్తున్నానో.. ప్రేక్షకులకు ఎలా దగ్గరవ్వాలో కూడా తెలియదు. ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో అవగాహన లేదు. కానీ నా పదేళ్ల ప్రయాణంలో జీవితంలో ఎలా పైకి ఎదగాలో నేర్చుకున్నాను. పాత్రలు, కథల ఎంపికలో మార్పులు చేస్తూ.. కుటుంబంతో కలిసి చూసేలా సినిమాలు తీయాలని నిర్ణయించు కున్నాను. ఇప్పుడిదే నా లక్ష్యం. ఈ ప్రయాణంలో ఎన్నో మరువలేని జ్ఞాపకాలను పోగుచేసుకున్నాను. ఇప్పటికీ రోజూ కొత్తగానే అనిపిస్తుంటుంది. ప్రేమ, కలలు, చిరునవ్వులు, కన్నీళ్లు.. ఇలా ఎన్నో అనుభవాలను ఎదుర్కొన్నాను. నా లక్ష్యాన్ని సాధించడానికి సహకరించిన దర్శకులకు, సహనటులకు, అభిమానులకు కృతజ్ఞతలు' అని చెప్పుకొచ్చింది కియార.

## ఫేక్ అకౌంట్లతో జాగ్రత్త

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫొటోలు, సినిమాల విశేషాలు పంచుకుంటారు. తాజాగా ఆమె పేరుతో ఉన్న ఓ ఎక్స్ అకౌంట్‌లో అసభ్యకరమైన పోస్టులు దర్శనమిచ్చాయి. దీంతో ఈ ఖాతాలపై టీమ్ క్లారిటీ ఇచ్చింది. 'డిజిటల్ ప్రపంచంలో ఎవరి పేరుతోనైనా అకౌంట్ క్రియేట్ చేయడం సులభంగా మారింది. జాన్వీకపూర్‌కు అధికారిక ఎక్స్ (ట్విటర్) ఖాతా లేదని మరోసారి స్పష్టం చేస్తున్నాం. దయచేసి ఈ ఫేక్ అకౌంట్‌లను ప్రోత్సహించకండి. వాటిని ఫాలో కావొద్దు. వీటిలో పోస్ట్ చేసే సమాచారాన్ని నమ్మొద్దు. మీ అందరి సహకారానికి ధన్యవాదాలు' అని అప్రమత్తంగా ఉండాలని టీమ్ కోరింది. ఆమె పేరుతో ఎక్స్‌లో ఉన్న నకిలీ ఖాతాల వివరాలను పేర్కొంది. జాన్వీ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉండడం కోసం కేవలం ఇన్‌స్టానే వాడతారని టీమ్ పేర్కొంది. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఇన్‌స్టాలో 24 మిలియన్ల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇటీవల 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్స్‌లో జాన్వీ మాట్లాడుతూ.. సోషల్ మీడియా అంటే తనకు భయమని తెలిపారు. ప్రముఖ సోషల్ మీడియా వెబ్‌సైట్ రెడిట్ ను తనకంటే తన చెల్లి ఖుషీనే ఎక్కువగా వాడుతుందని చెప్పారు. ఇందులో విశేషాలు చెల్లిని అడిగి తెలుసుకుంటానని ఆమె వెల్లడించారు. ఇటీవలే ఈ చిత్రంతో విజయాన్ని అందుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం తెలుగులో రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ సరసన నటిస్తున్నారు.



# షటిల్ పోటీలు ప్రారంభం

## కొనసాగుతున్న జర్నలిస్టుల క్రీడలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్-2024 లో భాగంగా మంగళవారం జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో షటిల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే-ఐజేయూ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తొట సుధాకర్, టీయూడబ్ల్యూజే(హెచ్) 143 హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, నాయకపు సుభాష్ లు అతిథులుగా హాజరయ్యారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అతిథులకు క్రీడాకారులను పరిచయం చేశారు. వారికి క్లబ్ తరపున జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు, క్రీడాకారులు, స్టాఫ్ రిపోర్టర్లు, జర్నలిస్టులు, షటిల్ కోచ్ రమేష్ పాల్గొన్నారు. కాగా షటిల్ పోటీలకు ఇంచార్జులుగా అల్లం రాజేశ్ వర్మ, వలిశెట్టి సుధాకర్, డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, బాలవారి విజయ్ రాజ్, మంచాల రాజు వ్యవహరించారు.

### రెండో రౌండ్ క్యారం పోటీలు..

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ స్పోర్ట్స్ మీట్-2024 లో భాగంగా జరుగుతున్న క్యారం పోటీల్లో 44 జట్లు పాల్గొనగా మొదటి రౌండ్ ఇప్పటికే పూర్తయింది. మంగళవారం రెండో రౌండ్ పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం నిర్వహించనున్న మూడో రౌండ్ కోసం డ్రా తీసీ పోటీ వివరాలను వెల్లడించారు. రెండో రౌండ్ లో విజయం సాధించిన వారు మూడో రౌండ్ కోసం ఉదయం 10.30 గంటలకల్లా ప్రెస్ క్లబ్ కు వచ్చి ఆటలో పాల్గొనాలని నిర్వాహణ కమిటీ కోరింది. మూడో రౌండ్ పూర్తి అయిన తర్వాత సెమీఫైనల్ ఉంటుందని పేర్కొన్నారు. అయితే క్యారం పోటీలకు ఇంచార్జులుగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీతోపాటు క్యారం క్రీడా బాధ్యులు గోకారపు శ్యాం కుమార్, కందుకూరి సంజీవ్ వ్యవహరించనున్నారు.



# వీధి కుక్కల దాడిలో.. పసికందు మృతి

## మహబూబాబాద్ జిల్లాలో దారుణం

**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని, మడిపల్లి గ్రామంలో వీధి కుక్కల దాడిలో 42 రోజుల పసికందు మృతి చెందిన సంఘటన అందరినీ కంటతడి పెట్టించింది. మడిపెల్లి గ్రామానికి చెందిన రేణుకకు ఇనుగుర్తి మండలం, చిన్న ముప్పారం (చెట్ల ముప్పారం) గ్రామానికి చెందిన దర్శనం వెంకన్నతో వివాహమైంది. ప్రసవంకోసం తల్లిగారింటికి రాగా ఇటీవల మగ శిశువుకు జన్మనిచ్చింది. ఉక్కపోత కారణంగా సోమవారం ఉదయం 8 గంటలకు బాలుడిని ఆరుబయట పరుండబెట్టి రేణుక, ఆమె తల్లి ఇతర పనుల్లో నిమగ్నమయ్యారు. అక్కడికి చేరుకున్న వీధికుక్క నిద్రిస్తున్న శిశువు తలపై తీవ్రంగా గాయపర్చింది. ఆ పనికందు ఏడుపు విన్న తల్లి హుటాహుటిన అక్కడికి చేరుకొని తీవ్ర గాయాలతో ఉన్న శిశువును తొర్రూరులోని ప్రభుత్వ పాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. కాన్పు కోసం తల్లిగారింటికి వస్తే పసికందును కుక్క బలితీసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



# హాజరు తీసుకున్న కమిషనర్

## ఉదయం 5 గంటలకే అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలన

## గైర్హాజరైన సిబ్బందిపై ఆరా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శానిటేషన్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ శానిటేషన్ సర్కిల్ నెంబర్ 9 పరిధి అశోక థియేటర్ సమీపంలో గల శానిటరీ ఇన్ స్పెక్టర్ కార్యాలయం, అమృత థియేటర్ పాయింట్ వద్ద ఉదయం 5 గంటలకే పారిశుధ్య సిబ్బంది అటెండెన్స్ ను కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సిబ్బంది గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా ఎక్కడ పనిచేశారు, ఏ ఏ పనులు చేశారంటూ ఆరా తీశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైతే జీతంలో కోత విధించాలని, అవుట్ సోర్సింగ్ శానిటేషన్ సిబ్బంది సుదీర్ఘకాలం విధులకు రాకుంటే తొలగించాలని, పిన్ పాయింట్ ప్రోగ్రాంలో భాగంగా శానిటరీ ఇన్ స్పెక్టర్ లకు చెత్త తొలగింపు, డ్రైన్ లలో డీసిల్టేషన్, రోడ్లను శుభ్రంగా ఉంచడం సంబంధిత అంశాలపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కుమార్ పల్లి, మచిలీ బజార్ ప్రాంతంలో శానిటేషన్ తీరును పరిశీలించి నిర్వహణ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పని తీరు మెరుగు పడాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ పసునూరి భాస్కర్, సానిటరీ ఇన్ స్పెక్టర్ అనిల్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** గిరిజనుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని, ములుగు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని, త్వరలోనే ఐటీడీఏ పాలక మండలి సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం ఏటూరు నాగారం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ కార్యాచరణ ప్రణాళిక సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ యాదవ్, ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ బి.గితే లతో కలిసి మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఐటీడీఏ పాలకమండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఆరు నెలలుగా పెండిగ్ లో ఉన్నా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పనుల్లో అత్యంత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని సూచించారు. గుత్తి కోయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, వరదల సమయంలో గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పపువ్వు చెట్ల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తద్వారా గిరిజనులకు ఉపాధి లభించడంతోపాటు అడవి పచ్చదనంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఐటీడీఏ డీడీ పోచాం, డీఎంహెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, డాక్టర్ క్రాంతి కుమార్, ఓ రాజ్ కుమార్, జీసీసీ జనరల్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, డీడబ్ల్యుఓ స్వర్ణలత లెనిన, ఐటీడీఏ ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com